## నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకాంతారావు, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ

నిజాంసాగర్, జూన్ 23: వానాకాలం పంటల సాగుకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువ ద్వారా ఆదివారం నీటిని విడుదల చేశారు. ఆయకట్టు రైతులు నాట్లు వేయనున్న దృష్ట్యా మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభారాజు, ఇరిగేషన్ అధికారులతో కలిసి నీటి విడుదలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటగా ఈ ప్రాంతంలోని రైతులు రోహిణి కార్తెలోనే నార్లు పోసి త్వరగా నాట్లు వేస్తారని అన్నారు. గత ఏడాది మాదిరి ఈ సంవత్సరం కూడా జూన్ నెలలోనే నీటిని విడుదల చేయాలని రైతులు కోరారని, రైతుల కోరికను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రైతుల కోరిక మేరకు వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేశామన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 17.6 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4.3 టీఎంసీల నీరు ఉన్నదని, ఇందులో డెడ్ స్టోరేజ్ పోను 3.6 టీఎంసీల నీటిని కాలువలకు విడుదల చేయవచ్చని తెలిపారు. మొదటి విడుతలో భాగంగా 15రోజుల పాటు 1400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని, తర్వాత ఒక్కో విడుతలో పది రోజులు నీటి విడుదల జరుగుతుందని చెప్పారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేసి అన్ని డిస్ట్రిబ్యూటరీలకు నీళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీళ్లు లేకపోవడంతో ఈ ఏడాది వానాకాలం పంటల సాగుకు నీరు విడుదల చేయలేదని, కేవలం నిజాంసాగర్ నుంచి మాత్రమే నీటి విడుదల జరిగిందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### ఇండ్లలోకి నిజాంసాగర్ ప్రాజెక్టు నీరు



గాలీపూర్‌లో ఓ ఇంట్లోకి చేరిన నిజాంసాగర్ నీరు

నిజాంసాగర్, జూన్ 23: మహ్మద్‌నగర్ మండలం గాలీపూర్ గ్రామంలో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీరు ఇండ్లలోకి చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి. వానాకాలం పంటల సాగు కోసం ఆదివారం బాన్సువాడ, జుక్కల్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకాంతారావు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి మొదటి విడుత నీటిని విడుదల చేశారు. కాగా డిస్ట్రిబ్యూటరీ ద్వారా అధికారులు పరిమితికి మించి నీటిని విడుదల చేయడంతో గాలీపూర్ గ్రామంలోకి నీరు చేరుకున్నది. రోడ్డుపై, ఇండ్లలోకి నీళ్లు చేరాయి. కెనాల్ మరమ్మతులు చేపట్టకపోవడంతోపాటు అధికారుల నిర్లక్ష్యంతోనే నిజాంసాగర్ నీరు ఇండ్లలోకి చేరుతుందని బాధితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో సైతం పలుమార్లు కెనాల్ మరమ్మతులు చేపట్టాలని సంబంధిత శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు.



నాగిరెడ్డిపేటలో కళాశాలకు కేటాయించిన గది దుస్థితి

- నాగిరెడ్డిపేట ప్రభుత్వ కళాశాల తీరు
- గదులు లేవు.. వసతులు కరువు
- చేరేందుకు ఇష్టపడని విద్యార్థులు

# ఇట్లుంటే.. ఎట్లొస్తరు




స్థలం లేక రోడ్డుపై కట్టిన కళాశాల ఫ్లెక్సీ

నాగిరెడ్డిపేట, జూన్ 23 : నలభై ఏండ్ల కల నెరవేరిందని సంబురపడాలో.. కనీస వసతులు లేక బాధపడాలో..తెలియని స్థితిలో నాగిరెడ్డిపేట ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. చిరకాల స్వప్నం అయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల గతేడాది అప్పటి ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంజూరు చేయించారు. మండల కేంద్రంలోని గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో తరగతులను ప్రారంభించారు. కళాశాల కోసం సమీపంలోని మాల్తుమ్మెద విత్తనక్షేత్రంలో ఉన్న వ్యవసాయ పాలిటెక్నిక్ పక్కన రెండు ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలలో కేవలం ఒక్క గదిని మాత్రమే కేటాయించడంతో ఒక టేబుల్, రెండు కుర్చీలతో కళాశాల కొనసాగుతున్నది. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్‌కు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలలో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉండడం, గదుల కొరతతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతుండడంతో కళాశాల గదిని ఖాళీ చేసి వెళ్లిపోవాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నట్లు కళాశాల అధ్యాపకులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్పందించి కళాశాలను కాపాడుకోవడానికి కృషి చేయాలని కోరుతున్నారు.

**అధ్యాపకులు, గదుల కొరత..**

కళాశాల మంజూరైన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్క తరగతి గది కూడా ఏర్పాటు చేయలేదు. ఎల్లారెడ్డి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ హేమచందర్‌ను నియమించగా ఇటువైపు కన్నెత్తి చూసిందీ లేదు. అదే కళాశాలకు చెందిన జూనియర్ లెక్చరర్ నాగయ్యను ఇక్కడికి డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ఒక అటెండర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో కళాశాల నిర్వాహణ తూతూ మంత్రంగా ముందుకు సాగుతున్నది.



వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల పక్కన జూనియర్ కళాశాలకు కేటాయించిన రెండు ఎకరాల స్థలం

### ప్రచారం లేదు..విద్యార్థులు రారు

జూనియర్ కళాశాల ఉన్నట్లు అధ్యాపకులు ప్రచారం చేయకపోవడంతో అసలు మండలంలో కళాశాల ఉన్నట్లు కూడా మరిచిపోయారు. అన్నీ ఉచితంగా అందించి, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉన్నా సరైనా సమాచారం ఇచ్చే వారు లేక అప్పులు చేసి మరి ప్రైవేట్ కళాశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. కళాశాలలో తెలుగు, ఆంగ్లం భాషలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో బీపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలో ఒక్కో తరగతికి 80 మందికి పైగా విద్యార్థులకు గాను ఇప్పటి వరకు కేవలం 56 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారు. పరిస్థితి ఇలానే కొనసాగితే కళాశాల నిర్వాహణ కష్టమేనని పలువురు విద్యావంతులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

### తరగతి గదులు, వసతులు లేవు



కళాశాల మంజూరు చేసి ఏడాది అవుతున్నా ఇప్పటి వరకు కళాశాలలో కనీస వసతులు, గదులు లేవు. తమ పిల్లలను చేర్పించాలంటే కనీసం గది, బెంచీలు కూడా లేవు. పిల్లలు చేరేందుకు ఇష్టపడడం లేదు. ఎన్నో సంవత్సరాల ఎదురుచూపులతో వచ్చిన కళాశాల కనీస ఏర్పాట్లు లేకుండా అలంకారప్రాయంగా ఉండడం బాధగా ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వసతులు ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి.

**- ప్రవీణ్‌కుమార్, వదలపర్తి, మాజీ సర్పంచ్**

### వసతులు కల్పిస్తే బాగుంటుంది



కళాశాలలో తరగతి గదులు, వసతులు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. వసతులు లేక ముందుకు వెళ్లలేకపోతున్నాం. విద్యార్థులు ఇక్కడికి వచ్చి చూసి ఏమీ కనిపించపోవడంతో..జాయిన్ కావడం లేదు. జూలై 1 నుంచి తరగతులను ప్రారంభించాలని అనుకుంటున్నాం. వసతులు కల్పిస్తే..విద్యార్థులకు మంచి కళాశాలగా మారుతుంది. విద్యార్థులు చేరితేనే అధ్యాపకులు, సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుంది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవతీసుకొని ఏర్పాట్లపై కృషి చేస్తే విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుంది.

**- నాగయ్య, జూనియర్ లెక్చరర్, నాగిరెడ్డిపేట**

## ఫోర్జరీకి పాల్పడిన జేఎల్‌ఎం సస్పెండ్

**ఏఈ సెలవులో ఉన్న సమయంలో ఫోర్జరీ..**

వినాయక్‌నగర్, జూన్ 23: నిజామాబాద్ విద్యుత్‌శాఖలో ఐదు రోజుల క్రితం జరిగిన ఏఈ సంతకం ఫోర్జరీ ఆరోపణపై సీఎండీ సీరియస్‌గా పరిగణించారు. అందుకు సంబంధించిన బాధ్యులు ఎవరనే విషయంలో పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి నివేదికను అందించాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ విద్యుత్ శాఖ డీ-8 సెక్షన్ ఏఈ సెలవులో ఉన్న సమయంలో ఓ సంస్థకు మీటర్ జారీ చేస్తూ మంజూరు చేసిన ఆర్డర్ కాపీలో ఉన్నది తన సంతకం కాదని, ఫోర్జరీ జరిగినట్లు ఏఈ శ్రీవిద్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై క్వాలిటీ కంట్రోల్ ఏడీఈ మూడు రోజుల క్రితం సంబంధిత ఏఈతో పాటు జేఎల్‌ఎం, మీటర్ విభాగానికి చెందిన మరో ఉద్యోగిని విచారించారు. అనంతరం నివేదికను సీఎండీకి పంపించారు. డీ-8 ఏరియాలో జేఎల్‌ఎం బానోత్ రవి ఏఈ సంతకం ఫోర్జరీ చేసినట్లుగా విచారణలో తేలింది. దీంతో అక్రమానికి పాల్పడిన జేఎల్‌ఎంను ఎస్‌ఈ రవీందర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ డీఈ శ్రీనివాసరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

## గోదావరిలో పుణ్యస్నానాలు


**రెంజల్ మండలం** కందకుర్తి సమీపంలోని గోదావరిలో ఆదివారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆరుద్ర పర్వదినం పురస్కరించుకొని భక్తులు పెద్ద సంఖ్యలో గోదావరికి చేరుకున్నారు. ఇటీవల నదిలో కొత్తనీరు చేరడంతో తెప్పలను వదిలి మొక్కులు చెల్లించుకున్నారు. నదిలోని పురాతన శివాలయాన్ని దర్శించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

– రెంజల్, జూన్ 23



# కేసీఆర్ హయాంలోనే.. కోతలు లేని కరెంటు

'సమైక్య రాష్ట్రంలో కారుచీకట్లను చూశాం...స్వరాష్ట్రం వచ్చిన తర్వాత కేసీఆర్ సర్కారు వెలుగులు తీసుకొచ్చిండు. ఇండ్లు, పొలాల్లో 24గంటలపాటు కోతలు లేని కరెంటు ఇచ్చిండు. పదేండ్ల పాలనలో ప్రజలకు కరెంటు రంది లేకుండా చేసిండు. రాత్రిపూట బాయికాడికి పోకుండా పగటి పూట కట్క వొత్తంగనే బోరు పారేటట్లు చూసిండు. జిరాక్సు సెంటర్ నుంచి ఫ్యాక్టరీల దాకా మంచిగ నడిచేటట్లు కరెంటు ఇచ్చిండు. అలాంటి సార్‌పై నిందలు మోపడం సరికాదు. ఇప్పటికైనా కేసీఆర్ సారు ఇచ్చినట్లు కరెంటు మంచిగ ఇచ్చి మాట్లాడాలె..' అని సూచిస్తున్నారు ఉమ్మడి జిల్లా రైతులు, ప్రజలు. కేసీఆర్ హయాంలో కరెంటు సరఫరాపై వారి అభిప్రాయాలను నమస్తే తెలంగాణతో పంచుకున్నారు.



### అప్పుడే బాగుండె..



రెంజల్, జూన్ 23: కేసీఆర్ పదేండ్ల పాలనలో కరెంటు ఇబ్బందులు రాలేదు. అంతకుముందు ఏ టైంల కరెంటు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియకపోతుండె. కరెంటు సరిగ్గా లేక పనులు ఆగిపోతుండె. ఇప్పుడు కొత్తగా వచ్చిన సర్కారుల కరెంటు సక్కగ వస్తలేదు. పగటిపూట 10–12సార్లు కరెంటు పోతున్నది. లోవోల్టేజీతో పనులన్నీ ఆగిపోతున్నాయ్. చినుకుల వర్షం వచ్చినా కరెంటు పోతున్నది. ఇప్పుడే ఇట్ల ఉంటే వానకాలం మొత్తంల కరెంటు ఎట్ల ఉంటదో తలచుకుంటే భయమైతున్నది. కేసీఆర్ సారు ఉన్నప్పుడు కరెంటు మంచిగుండె.

**- అవేజ్‌బేగ్, వెల్డింగ్ దుకాణం యజమాని, సాటాపూర్**

### కేసీఆర్ కరెంటు రంది లేకుండా చేసిండు..



రెంజల్, జూన్ 23 : నేను కార్పెంటర్ పని చేస్త. తెలంగాణ రాక మునుపు కరెంటు కావాలంటే రోడ్ల మీద, సబ్‌స్టేషన్ల ధర్నాలు చేసేటోళ్లం. కరెంటు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేటోళ్లం. రోజులో మూడు లేదా నాలుగు గంటల కరెంటు వస్తే మస్తు అయితుండె. తెలంగాణ అచ్చినంక కేసీఆర్ సారు కరెంటు బాధను మొత్తం తీర్చిండు. కోతలు లేకుండా 24గంటలు కరెంటు ఇచ్చిండు. కరెంటు ఎక్కడి నుంచి తెచ్చిండో తెల్వదు కానీ మా లెక్క పని చేసుకొని బతికేటోళ్లను ఆదుకున్నడు. ఇప్పుడు పొద్దంతా కరెంటు పోవుడు.. వచ్చుడు.. ఇదే ముచ్చట. ఇగ తీసుకున్న ఆర్డర్ కస్టమర్‌కు ఇవ్వాలె కాబట్టి రాత్రిపూట నిద్రను తట్టుకొని పనిచేస్తున్నం.

**- నజీర్ అలీ, కార్పెంటర్, కందకుర్తి**

### పంటలు మంచిగ పండించినం..



ఎడపల్లి, జూన్ 23 : ఉమ్మడి రాష్ట్రంలో చాలీచాలని కరెంటుతో అనేక ఇబ్బందులు పడ్డం. రాత్రి పగలు అనే తేడా లేకుండా బావి కాడికి పోయి కరెంటు ఎప్పుడు వస్తదా అంటూ ఎదురుచూసేవాళ్లం. కేసీఆర్ వచ్చినంక రైతులకు ఎలాంటి సమస్యలు ఉండొద్దని 24గంటలు కరెంటు ఇచ్చిండు. ఆయన ఉన్నప్పుడు లోవోల్టేజీ లేదు. మోటర్లు కాలుడు తగ్గినయ్. పగటిపూటనే మోటర్లు నడిపించేటోళ్లం. దీంతో రెండు పంటలను మంచిగ పండించినం. రైతులకు మంచిగ జేసిన కేసీఆర్‌ను నిందించడం సరైంది కాదు. ఇప్పుడొచ్చినోళ్లు ఎన్కటి రోజులను గుర్తుకు తెస్తుండ్రు. కరెంటు పోవుడు షురూ అయ్యింది.

**- ఉప్ప పోశెట్టి, రైతు, ఎడపల్లి.**

### కరెంట్ పోయిందన్న ముచ్చటే లేకుండె..



ఎడపల్లి, జూన్ 23 : కేసీఆర్ సార్ సల్లగుండ. ఆయన ఉన్నప్పుడు కరెంట్ పోయిందన్న ముచ్చటే లేకుండె. కరెంటు కోతల గురించే మరిచిపోయినం. అంతకు ముందు గంటలకొద్దీ కరెంటు రాకపోతుండె. ఇగ మా గల్లీల బోరు నల్లాలు ఎప్పుడంటే అప్పుడు ఆన్ చేసి నీళ్లు పట్టుకునేటోళ్లం. కరెంట్ పోకపోతుండె. కరెంట్ బాధలు లేకుండె. మా మనువండ్లు రాత్రి పూట సక్కగా రాసుకొని చదువుకుంటుండె. రాత్రి కూడా కరెంట్ ఉంటుండె. కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చి మాకు ఎంతో మేలు చేసిండు. ఇప్పుడొచ్చిన సర్కారోళ్లు కరెంటు కోతలు షురూ చేసింది. రాత్రిపూట వాన చినుకు పడితే కరెంటు పోతుంది. చీకట్లో జాగారం చేస్తున్నం.

**- దండు మల్లవ్వ, గృహిణి, ఎడపల్లి.**